క్లుప్తంగా

నేడు రాజేష్ పర్యటన

నారాయణవనం: వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సోమవారం నారాయణవనంలో పర్యటించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు తెలిపారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీకాళహస్తిలో కార్డన్ సెర్చ్


పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున 1వ పట్టణ పోలీసులు ఎన్టీఆర్ నగర్, జయరామరావు వీధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అందులోభాగంగా 1వ పట్టణ సీఐ గోపి, రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సరైన రికార్డులులేని 12 మోటార్ సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. సీఐ గోపి మాట్లాడుతూ ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐలు సుధాకర్, ఈశ్వర్, విశ్వనాథనాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరంలో వైద్యులు

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరిలో ఆదివారం రేణిగుంట బాలాజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. దుర్గిపేరి, నచ్చనేరి, నాగంపల్లి, కృష్ణంపల్లి, జంగాలపల్లి గ్రామాల నుంచి వచ్చిన 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరి వీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం 156వ నెల ఉచిత సరుకులను దివ్యాంగులు, వృద్ధులకు అందజేశారు. సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ ఇన్ని నెలలుగా పేదవారికి, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా, సభ్యులు రాజేశ్వరరావు, హరి, ఢిల్లీ, బాబా ఫరీద్ పాల్గొన్నారు.

శివయ్యా.. క్షమించు


పాచిపట్టిన నీటిలో నందీశ్వరాలయం

రేణిగుంట: రేణిగుంటలో చారిత్రాత్మక ప్రాశస్త్యం కలిగిన నందీశ్వరాలయం పాచిపట్టిన నీటితో నిండి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రేణిగుంటలోని మంచినీళ్ల గుంట సమీపంలో ఉన్న ఈ ఆలయ కోనేరు ఉంది. ఇక్కడ పూజలు, దీప, ధూప నైవేద్యాలు లేక కళావిహీనంగా తయారైంది. దీనికితోడు కోనేరు పూర్తిగా వర్షపు నీటితో నిండి పచ్చగా పాచిపట్టి కనిపిస్తోంది. దుర్గంధం వెదజల్లుతున్న పాచిపట్టిన నీటి మధ్య పరమేశ్వరుని ఆలయం ఉండడం పట్ల పలువురు అపచారమంటూ ఆందోళన చెందుతున్నారు. ఆలయాన్ని, కోనేరును శుద్ధి చేయించాలని కోరుతున్నారు.

ఆపన్నులకు అండగా మరిన్ని సేవలు


కార్యాలయ ప్రారంభోత్సవంలో లోకేశ్వరిరెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో ఆదివారం లోకేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పేద ప్రజల శ్రేయస్సు, ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలిచేందుకు ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నట్లు ట్రస్ట్ చైర్మన్ లోకేశ్వరిరెడ్డి తెలిపారు. రానున్న రోజుల్లో సేవలు మరింత విస్తృతంగా చేపడతామన్నారు. కోటి, రాజశేఖర్, రేఖారెడ్డి, వార్డు సభ్యురాలు తహసీనా పాల్గొన్నారు.

కాజ్‌వేలు బాగుచేయరా..?

నారాయణవనం మండలంలోని అరుణానది వరద ఉధృతికి కాజ్‌వేలు దెబ్బతింటున్నాయి. వాటికి శాశ్వత మరమ్మతులు కాకుండా మట్టి వేస్తున్నారు. మళ్లీ వర్షాలు కురిసినప్పుడు మట్టి కోతకు గురై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడం సర్వసాధారణం అవుతోంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- తాత్కాలిక మరమ్మతులతో సరి
- అరుణానది ప్రవహిస్తే కోతకు గురి


తిరువట్యం కాజ్‌వే

నారాయణవనం: 2017లో వరుస తుపానులతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని అరుణానది ఉధృతంగా ప్రవహించింది. దీంతో తిరువట్యం, తుంబూరు, పాలమంగళం ఉత్తరపుకండ్రిగల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. వాహనాల రాకపోకల కోసం తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేసి గ్రావెల్‌తో మరమ్మతులు చేశారు. గత ఐదేళ్లు ఏటా భారీ వర్షాలు కురవడంతో తుంబూరు, పాలమంగళం కాజ్‌వేలపై ఇసుక బస్తాలు, పోసిన గ్రావెల్ కొట్టుకుపోయింది. నది ఉధృతి తగ్గాక ఇసుక బస్తాలు, గ్రావెల్‌తో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే తప్ప శాశ్వత మరమ్మతులు చేపట్టడం


గత ఏడాది పాలమంగళం కాజ్‌వేపై గ్రావెల్ పరుస్తున్న దృశ్యం(ఫైల్)

లేదు. దీంతో వర్షాలకు అరుణానది ప్రవహిస్తే తిరువట్యం పంచాయతీ వాసులు సమీపంలోని అడవి దారిలో నాగిలేరు, వీకే పాళ్యంల మీదుగా కాలినడకన రావాలి. తుంబూరు, పాలమంగళం వద్ద కాజ్‌వే కోతకు గురైతే జీఎస్ కండ్రిగ, సుబ్బానాయుడుకండ్రిగ మీదుగా రాకతప్పదని సమీప గ్రామాల వారు వాపోతున్నారు.

నిరుపయోగంగా బ్రిడ్జి

తుంబూరు, పాలమంగళం కాజ్‌వేలు వర్షాలకు దెబ్బతింటే కేవీబీ పురం వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తకుండా పాలమంగళం ఉత్తరపుకండ్రిగ వద్ద హైలెవల్ బ్రిడ్జిని 15 ఏళ్ల క్రితం ఆర్ అండ్ బీ నిర్మించింది. బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లకు అనుసంధానం చేయడానికి భూమి సేకరించాల్సి వుంది. దీనిపై రైతులు కోర్టును ఆశ్రయించడంతో బ్రిడ్జి నిరుపయోగంగా మారిపోయింది. పాలమంగళం కాజ్‌వే దెబ్బతిన్న ప్రతి సందర్భంలోనూ సమీప గ్రామాల ప్రజలు బ్రిడ్జికి ఇరువైపులా నిచ్చెనలు ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురాడానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

గ్రామసభల్లో ఊసే లేదు

గ్రామాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించడానికి నిర్వహించే గ్రామ సభల్లో దెబ్బతిన్న కాజ్‌వేల పునః నిర్మాణానికి, మరమ్మతులపై ప్రజలు చర్చించినా అధికారులు మాత్రం అశ్రద్ధ చూపుతూ, సమస్యలను జిల్లా అధికారులకు నివేదించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తిరువట్యం కాజ్‌వేను పంచాయతీరాజ్ శాఖ, తుంబూరు కాజ్‌వేను పంచాయతీ రాజ్ ప్రాజెక్ట్స్, పాలమంగళం కాజ్‌వేను ఆర్ అండ్ బీ శాఖ మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. మూడు కాజ్‌వేలను మూడు శాఖల పర్యవేక్షణ శాపంగా మారిందని సమీప గ్రామాల వాసులు వాపోతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దెబ్బతిన్న కాజ్‌వేలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పాలమంగళం కాజ్‌వే

ముక్కంటి సేవలో మంత్రి కొండపల్లి


ఆలయ ధ్వజస్తంభం వద్ద మంత్రి కొండపల్లి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల, సొసైటీశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

శ్రీకాళహస్తి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని సోమవారం ఆయన విగ్రహానికి నివాళులర్పించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. పట్టణంలోని వైఎస్సార్ కూడలిలో ఉన్న వైఎస్ విగ్రహానికి నివాళులర్పించేందుకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

నాగలాపురం: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు నాగలాపురంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు టి.అపరంజిరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నరకానికి రహదార్లు

రేణిగుంట: కొద్దిపాటి వర్షాలకే రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం, బీసీ బాలుర హాస్టల్‌కు వెళ్లే మార్గం గుంతలమయంగా ఉండేది. అయితే ఇటీవల ఆ గుంతల్లో బంకమట్టిని నింపారు. దీంతో ఆ మార్గంలో వెళ్లేవారు జారిపడుతున్నారు. వాహనాల్లో వెళ్లేవారు సైతం జారిపడుతున్నారు. హాస్టల్ విద్యార్థులు స్కూల్‌కు వెళ్లి, వచ్చే సమయంలో నరకయాతన అనుభవిస్తున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు సైతం గుంతలమయంగా ఉండడంతో లోడింగ్ లారీలు, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఎర్రమరెడ్డిపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ మార్గంలో పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో వాహనదారులు జారిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్ల మరమ్మతులపై దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రేణిగుంట మండలం గాజులమండ్యం సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గుంతల రోడ్డు, రొచ్చు, రొచ్చుగా రేణిగుంట బీసీ హాస్టల్‌కు వెళ్లే మార్గం

బత్తలవల్లం మాజీ సర్పంచ్ బుజ్జమ్మ మృతి


మాజీ సర్పంచ్ బుజ్జమ్మ (ఫైల్)

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుర్రం బుజ్జమ్మ మృతిచెందారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి వద్ద మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె 2006–2011 మధ్య బత్తలవల్లం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


పూలతో అలంకరించిన గంగమ్మదేవత విగ్రహం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట ఎస్సీకాలనీలోని గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆహ్వాన కరపత్రాల ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్: నగరంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే వినాయక చవితి, సామూహిక నిమజ్జనోత్సవాలకు ప్రజలను ఆహ్వానిస్తూ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ముద్రించిన ఆహ్వాన కరపత్రాలను ఆదివారం కమిటీ కార్యాలయంలో కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక నగరంలో అందరి సహకారంతో వినాయక చవితి, సామూహిక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

యువకుల రక్తదానం

వరదయ్యపాళెం: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన, బీజేపీ నేతలు వరదయ్యపాళెంలో ముందస్తుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరంలో 70 మంది యువకులు రక్తదానం చేశారు. అలాగే ఎంఎస్ఐ హాస్పిటల్ వైద్యులు 132 మందికి కంటి పరీక్షలు చేసి 47 మందికి అద్దాలు అందజేశారు. ఆపరేషన్లకు 18 మందిని ఎంపిక చేశారు. తిరుపతి జిల్లా జనసేన ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్, నాయకులు తడ శీను, దొడ్డి శేఖర్, కేబీ గురుదేవ్, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, శ్రీధర్, పురుషోత్తమ్ పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితం నాశనం



కాటూరులో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత ముందుకు రావాలని ఎస్ఐ విశ్వనాథనాయుడు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం కాటూరు గ్రామంలో డ్రగ్స్ ఫ్రీ ఇండియా అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ లేకుండా చేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని, మత్తు పదార్థాలను వాడడం చట్టరీత్యా నేరమని తెలిపారు. యువత మత్తుకు బానిసైతే కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

యంగ్ ఎంప్లాయీస్ సేవలు ప్రశంసనీయం


బహుమతులను అందజేస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి: యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ సేవలు ప్రశంసనీయమని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. యంగ్ ఎంప్లాయీస్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, మండల పరిధిలోని 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం విజేతలకు బహుమతులను అందజేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలన్నారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సురేష్ బాబు, సంస్థ సభ్యులు హేమకుమార్, మునస్వామి, నారాయణ, షరీఫ్, శ్రీనివాసులు, అంజయ్య, చంద్రకాంత్, రాజశేఖర్, రమణ, సాయి, ప్రదీప్‌కుమార్, పార్థసారధి పాల్గొన్నారు.

మూలనపడ్డ పేదల మందులు


ఇందిరానగర్ సచివాలయంలో నిర్లక్ష్యంగా పడేసిన మందులు

వరదయ్యపాళెం: పేద ప్రజలకు అందించాల్సిన మందులను ఇందిరానగర్ సచివాలయంలో నిర్లక్ష్యంగా మూలనపడేయడం విమర్శలకు దారితీస్తోంది. సచివాలయంలో విధులు నిర్వహించే వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తీసుకువచ్చిన మందులను పేద ప్రజలకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా మూలనపడేశారు. వాటిని వినియోగించాల్సిన సమయం కూడా దాటి పోతుండడంతో నిరుపయోగంగా మారనున్నాయి. ప్రజలకు ఉపయోగించాల్సిన మందులను చెత్తబుట్టలో పడేయడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపే లక్ష్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి: ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలను పారదోలి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జనవిజ్ఞానవేదిక లక్ష్యమని జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప అన్నారు. పట్టణంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రత్యేక చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతం టాలెంట్ టెస్టు పోస్టర్‌ను ఆవిష్కరించారు. షరీఫ్, అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, శ్రీనివాసులు, చెంగయ్య, కుప్పయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో చెరువు కలుజు


కలుజుకు పడిన గండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అరిగిలకండ్రిగ గ్రామ చెరువు కలుజు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో చెరువులోని నీరంతా వృథాగా పోతోంది. చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. కలుజును నిర్మించి 35 సంవత్సరాలు అవుతోంది. ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. దీంతో శిథిలావస్థకు చేరింది. చెరువులోని నీరు వృథాగా పోతుడడంతో నీరు చాలక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కలుజుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఇరిగేషన్‌శాఖ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలుజుకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గుంతలమయమైన రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కాటూరు గ్రామ సమీపంలోని కాళంగి నదిపై నిర్మించిన వంతెన పైన ఉన్న రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మించిన నాటి నుంచి రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డుపై గుంతలు పడ్డాయి. వర్షం పడితే గుంతలలోకి నీరు చేరడంతో వాహనదారుల బాధలు వర్ణణాతీతం. పలు వాహనాలు ప్రమాదాలకు గురికావడంతో వాహనదారులు గాయపడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


వంతెన రోడ్డుపై ఉన్న గుంతలు


వంతెన రోడ్డుకు ఏర్పడిన గొయ్యి

రాజీవ్‌నగర్‌లో సమస్యల తిష్ట

- కక్షసాధింపులతో సరి
- మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- అభివృద్ధిని పట్టించుకోని పాలకులు
- అమృత్‌నగర్ నిధులైనా కేటాయిస్తారో లేదో?



రాజీవ్‌నగర్‌లోని మట్టిరోడ్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న రాజీవ్‌నగర్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు, రోడ్లు కేటాయించినా వాటికి కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రస్తుత పాలకులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షగట్టి అక్రమ నిర్మాణాల పేరుతో భవనాలు కూలదోయడానికే పాలకులు ప్రాధాన్యమిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

మట్టిరోడ్లే దిక్కు

రాజీవ్‌నగర్‌లో గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేసి, పేదలకు రెండు వేల ఇళ్లు మంజూరు చేసింది. అలాగే దివంగత నేత వైఎస్సార్ హయాంలో ఐదు వేల ఇళ్లు, టిడ్కో గృహాలు నాలుగు వేలు ఇలా.. మొత్తం పది వేల గృహాలు ఉన్నాయి. గత ప్రభుత్వం మౌలిక సుదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా, అంతలోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. విద్యుత్ స్తంభాలు, బోర్లు, ప్రధాన రహదారి మరమ్మతులు అలాగే ఉండిపోయాయి. చిన్న వర్షానికే కాలువలు లేకపోవడంతో వీధులు జలమయమవుతున్నాయి. కాలువలు, సిమెంటు రోడ్ల ఊసే లేదు. నేలకు సమాంతరంగా ఉన్న ఓ బావి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ ప్రాంతంలో ఒక పాఠశాల గానీ, అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం స్థానికులను బాధిస్తోంది. ఇళ్ల చుట్టూ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగిపోయాయి. విషపురుగుల బెడద అధికమైందని స్థానికులు వాపోతున్నారు.

అమృతనగర్ నిధులైనా కేటాయిస్తారా?

శ్రీకాళహస్తి పట్టణానికి అమృతనగర్ నిధులు భారీగా విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధి చెందిన, ధనికులు ఉండే ప్రాంతాలకే ఈ నిధులు కేటాయించకుండా రాజీవ్‌నగర్ లాంటి ప్రాంతాలపై దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మా పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకం



అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో పిల్లలకు ఇబ్బందికరంగా మారింది. సాధ్యమైనంత త్వరగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి. అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలంటే కిలోమీటర్ ఉంది. నాలుగువేల కుటుంబాలు ఉండే ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం బాధాకరం.

– లక్ష్మి, రాజీవ్‌నగర్ కాలనీ

మౌలిక సదుపాయాలు కల్పించండి



రాజీవ్‌నగర్‌లో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలి. దీపాలు ఉన్నా వెలగడంలేదు. వెంటనే మరమ్మతులు చేసి వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలి. పేదవారికి అవసరమైన మౌలిక సదుపాయాలు రాజీవ్‌నగర్‌లో కల్పించాలి.

– బాలచంద్ర, రాజీవ్‌నగర్ కాలనీ


ముళ్లపొదలతో నిండిన ప్రాంతం


రాజీవ్‌నగర్‌లో బురదమయమైన మట్టిరోడ్డు


మురుగునీటి నిల్వలు